# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 02 సోమవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 128

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





విడుదల చేసిన ప్రభుత్వం

# సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము

**సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు శుభవార్త చెప్పారు. ఈ ప్రభుత్వం రైతు భరోసా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. 'మారీచుల మాయమాటల నమ్మొద్దు.. సోనియాగాంధీ గ్యారంటీగా నేను చెబుతున్నా' అని రైతులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మీడియాతో మాట్లాడారు. రైతు భరోసాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశామని, అసెంబ్లీలో చర్చించి త్వరలో విధివిధానాలు ఖరారు చేస్తామని సీఎం తెలిపారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఎలా పూర్తి చేశామో.. రైతు భరోసా కూడా అదేవిధంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రూ.7లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ తమకు ప్రభుత్వాన్ని అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. "ప్రభుత్వం ఇంత అప్పుల్లో ఉందని కేసీఆర్, హరీశ్‌రావు, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్, అధికారులు ఎవరూ చెప్పలేదు. మే అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఆస్తులు-అప్పులపై శ్వేతపత్రం విడుదల చేశాం.

భారాస ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతి నెలా రూ.6,500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం. భారీగా ఉన్న అప్పు చూసి కూడా అధైర్యపడకుండా పాలన సాగిస్తున్నాం. కేసీఆర్ బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతు బంధు మేం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించాం. ఇప్పటి వరకు 25.35 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలు మాఫీ చేశాం. మిగతా 9 ఏళ్లు కూడా అన్ని కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తామనే నమ్మకం కలిగింది. నెహ్రూ నుంచి నేటి వరకు రైతులకు తొలిప్రాధాన్యం ఇస్తున్నది కాంగ్రెస్‌పార్టీయే. రుణమాఫీ విషయంలో భారాస ప్రభుత్వం రైతులను పదేళ్లపాటు మోసం చేసింది" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.





## మాలల హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడాలి

కంటోన్మెంట్/కారానా: మాలల హక్కులు, ఆత్మగౌరవం కోసం అందరం కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మాలలు ఏ వర్గం అభివృద్ధిని అడుకోవడం లేదని, స్వయంశక్తితో ఎదుగుతున్నారని తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మాల మహానాడు ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మాలల సింహగర్జన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. "ఆర్టికల్ 341 సవరణతో మాలల రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉంది. దళితులందరినీ ఐక్యంగా ఉంచడానికి రిజర్వేషన్లు తీసుకొచ్చిన అంబేడ్కర్‌ను ఎవరు విమర్శించినా ఊరుకునేది లేదు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న సమయంలో నాపై ఈడీ దాడులు జరిగినా బెదరలేదు. అలాంటిది నేను మంత్రి పదవి కోసం ఈ సభ నిర్వహిస్తున్నానని విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం" అని ప్రశ్నించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

మాట్లాడుతూ.. మాలలు కష్టపడి చదివి, ఉద్యోగావకాశాలు సంపాదించుకున్నారే తప్ప ఎవరి అవకాశాలను దెబ్బతీయలేదన్నారు. 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ మాలలను దొంగల్లా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ..ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు మాలలను అవమానపరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒక్క శాతం ఉన్నవాళ్లు రాజ్యాధికారం చేపడుతున్నప్పుడు.. అధిక శాతం ఉన్న మాలలు ఎందుకు చేజిక్కించుకోకూడదని ప్రశ్నించారు. మాజీ మంత్రులు డాక్టర్ విజయరామారావు, పి.శంకర్‌రావు, వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ.. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు కేవలం సలహా మాత్రమే ఇచ్చిందని, పాటించాలా లేదా అన్నది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వదిలేసిందన్నారు. మొదట భాజపా పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి దేవయ్య మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీలు మాలలకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, దిల్లీ మాజీ మంత్రులు రాజేంద్రభూపాల్, భన్వర్‌సింగ్ పాశ్వాన్, మాల మహానాడు నేతలు సర్వయ్య, కృష్ణయ్య, రెంజర్ల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా మాలలు తరలివచ్చారు.

## ఏటూరునాగారంలో భారీ ఎన్‌కౌంటర్..




**ఏడుగురు మావోయిస్టుల మృతి. ఏటూరు నాగారంలో ఘటన.**

వీరి కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంతో పాటు తాడ్వాయి, గోవిందరావుపేట, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో గాలింపు చర్యలు ఉద్ధృతం చేశారు.

## అనర్హులను ఎలా నియమిస్తారు?

ఆరోగ్య కార్యకర్తల నియామకంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

కాంట్రాక్టు విధానంలో తీసుకున్నా అర్హతలు ఉండాల్సిందే

2013లో ఉమ్మడి ఏపీ సర్కార్‌ఇచ్చిన జీవో చెల్లదు







## అవి'నీటి' తిమింగలం

నీటిపారుదల శాఖ ఏఈఈ ఇల్లు, బంధువుల నివాసాల్లో అనిశా సోదాలు

నిఖేశ్‌కుమార్ అరెస్ట్

రూ.17.73 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ.100 కోట్లుంటుందని అంచనా

**అతడు చేసింది ఏఈఈ ఉద్యోగమే.. కానీ అక్రమాస్తులు మాత్రం కొండంత. ఉద్యోగంలో చేరి పదేళ్లలోపే అయినా అవినీతి సంపాదన రోజుకు రూ.లక్షల్లోనే.**

## కాంగ్రెస్‌కు షాకిచ్చిన ఆప్.. కేజ్రీవాల్ కీలక ప్రకటన

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలపై జాతీయ పార్టీలు ఫోకస్ పెడుతున్నాయి. వచ్చే ఏడాది ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాయి. ఈ క్రమంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలక ప్రకటక చేశారు. వచ్చే ఎన్నికల్లో తాము ఎలాంటి పొత్తులు లేకుండానే ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పారు. ఆప్ ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు క్లారిటీ ఇచ్చారు.మాజీ సీఎం కేజ్రీవాల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుంది. ఎన్నికల కోసం ఎవరితోనూ పొత్తు ఉండదు. ఇండియా కూటమితో పొత్తుకు మేము సిద్ధంగా లేమంటూ కుండబద్దలు కొట్టారు. ఇదే సమయంలో ఢిల్లీలో శాంతిభద్రతల అంశంపై కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు నేను చేసిన తప్పు ఏంటి..? ఢిల్లీ శాంతిభద్రతల విషయంలో కేంద్రమంత్రి అమిత్ షా చర్యలు తీసుకుంటారని ఆశించాను. కానీ, దానికి బదులు పాదయాత్రలో నాపైనే దాడి జరిగింది. మేము ప్రజా సమస్యలను లేవనెత్తాము. మీకు వీలైతే.. గ్యాంగ్‌స్టర్లను అరెస్టు చేయించండి. అంతే కానీ, మమ్మల్ని ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'రేవంత్ భాష మార్చుకుంటే మేం చర్చకు సిద్ధం'

హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి భాష మార్చుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై చర్చకు తాను సిద్ధమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై 6 అబద్ధాలు.. 66 మోసాలు.. పేరిట కిషన్‌రెడ్డి ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాష మార్చుకుంటేనే రేవంత్‌రెడ్డితో చర్చకు వస్తాం.కేసీఆర్ లాగా అదే భాష కాకుండా.. నిర్మాణాత్మక అంశాలపై మేము చర్చకు సిద్ధం. కుల గణనను మేము



వ్యతిరేకించడం లేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం.. గ్రూప్ 1, 2, 3, 4 నియామకాలు ఎప్పుడో పూర్తవ్వాలి. ఇప్పటి వరకు ఫస్ట్ ఫేస్ కూడా పూర్తికాలేదు.షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు ఏదీ పూర్తవ్వలేదు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. భూసేకరణ చేపట్టవద్దని కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేశారు.కాంగ్రెస్ కూడా భూసేకరణ చేపట్టే సమయంలో పద్ధతి ప్రకారం చేయాలి.. రైతులతో మాట్లాడి పరిష్కారం చేసుకోకుండా రైతులపై దాడులా..ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం నడుచుకోవాలి.ఫామ్ హౌజ్‌లో ఉన్న కేసీఆర్‌తో కాంగ్రెస్ సంబంధాలు పెట్టుకుందికేసీఆర్ పుట్టిందే కాంగ్రెస్‌లో..కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు. రేవంత్ దృష్టిలో

ఆయన్ను ప్రశ్నించే వారు.. వార్తలు రాసేవారు కూడా మానవ మృగాలే. కాంగ్రెస్ మేనిఫెస్టో అమలుకు ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకోవాలో కూడా రోడ్డు మ్యాప్ లేదు'అని మండిపడ్డారు.




## బీజేపీ ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ సెటైర్లు

# ఏటూరునాగారంలో భారీ ఎన్‌కౌంటర్..

ఏటూరు నాగారం: ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం చల్పాక అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఎన్‌కౌంటర్‌పై పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.



మృతుల్లో మావోయిస్టు కీలక నేతలున్నట్లు తెలుస్తోంది. ఇల్లందు నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి భద్రు అలియాస్ పాపన్నతో పాటు అతడి దళ సభ్యులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో కురుసం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), ఎగోలపు మల్లయ్య అలియాస్ మధు(43), ముస్సకి దేవల్ అలియాస్ కరుణాకర్(22), ముస్సకి జమున (23), జైసింగ్ (25), కిశోర్ (22), కామేశ్( 23) ఉన్నట్లు సమాచారం.

ఏటూరునాగారం ఏజెన్సీలో ఉద్రిక్తత..

మావోయిస్టుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏటూరునాగారం ఏజెన్సీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందగా.. మరో 8 మంది తప్పించుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరి కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతంతో పాటు తాడ్వాయి, గోవిందరావుపేట, ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో గాలింపు చర్యలు ఉద్ధృతం చేశారు. ప్రధాన రహదారుల మీదుగా వచ్చి పోయే వాహనాలను నిలిపి సోదాలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.మావోయిస్టుల నుంచి ప్రతికార చర్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఏజెన్సీలో ఏం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# అనర్హులను ఎలా నియమిస్తారు?



హైదరాబాద్: సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులతో తొలగింపునకు గురైన 1,200 మందిని కాంట్రాక్టు పద్ధతిలో బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తలుగా విధుల్లోకి తీసుకోవడం చట్టవిరుద్ధమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లో జారీ చేసిన జీవో 1207ను కొట్టివేసింది. బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల నియామకంపై 2002లో అర్హతల వివాదం నెలకొనగా, నిబంధనలకు విరుద్ధంగా సర్కార్ జీవోలు జారీ చేసి, నియామకాలు చేపట్టడం సరికాదని పేర్కొంది. ఈ అంశాన్ని ఉన్నత, అత్యున్నత న్యాయస్థానాలు తప్పుబట్టిన విషయాన్ని గుర్తు చేసింది. అర్హతలకు సంబంధించి న్యాయస్థానాలు తీర్పులు వెలువరించిన తర్వాత వాటికి విరుద్ధంగా మళ్లీ జీవో తీసుకురావడాన్ని తప్పుబట్టింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించలేమని, వారి తప్పును కొనసాగించలేమని వ్యాఖ్యానిస్తూ.. ఈ ఉత్తర్వులు వెలువడిన 90 రోజుల్లోగా అర్హులతో జాబితా రూపొందించి చర్యలు చేపట్టాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు తేల్చిచెప్పింది.అర్హులైన వారిని కొనసాగించవచ్చని పేర్కొంది. బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల నియామకానికి సంబంధించి 2002లో ఇచ్చిన నోటిఫికేషన్ వివాదాస్పదమైంది. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. గుర్తింపు పొందిన సంస్థ నుంచి హెల్త్ అసిస్టెంట్లుగా డిప్లొమా చేసిన వారినే అర్హులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. ఆ మేరకే మెరిట్ జాబితా రూపొందించాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు కూడా ఇదే తీర్పును సమర్థించింది. దీంతో ప్రభుత్వం సరైన అర్హతలు లేని 1,200 మందిని తొలగిస్తూ జీవో జారీ చేసింది. అయితే ఇంత మందిని ఒకేసారి తొలగించాల్సి రావడంతో ప్రభుత్వం వీరందరినీ కాంట్రాక్టు విధానంలో తీసుకుంటూ జీవో 1207 జారీ చేసింది. దీనిపై కొందరు నాడు ఏపీ పరిపాలన ట్రిబ్యునల్‌లో పిటిషన్లు దాఖలు చేయగా, సర్కార్ నిర్ణయం సబబేనని చెప్పింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు.

ఖాళీలుంటే నిబంధనల మేరకు భర్తీ..

ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'కేవలం 9 ఏళ్లు (2002 నుంచి) సర్వీస్ చేశారన్న కారణంగా సుప్రీంకోర్టు, హైకోర్టు నిర్ధారించిన అర్హతలు లేని వారిని కాంట్రాక్టు విధానంలో తీసుకోవడం సరికాదు. రెగ్యులర్, కాంట్రాక్టు విధానం.. ఏ నియామకమైనా అర్హతలు పాటించాల్సిందే. ఒకసారి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం చెల్లదు.

ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తే.. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా ఉత్తర్వులిచ్చినట్లే అవుతుంది. 1,200 మందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడం తప్పుబట్టాల్సిందే. 90 రోజుల్లో అర్హులతో జాబితా రూపొందించాలని తెలంగాణ, ఏపీ సర్కార్‌లను ఆదేశిస్తున్నాం. అర్హులను కొనసాగింపుపై చర్యలు తీసుకోవచ్చు. ఒకవేళ ఇంకా ఖాళీలు ఉంటే చట్టప్రకారం నిబంధనలు పాటిస్తూ నియామకాలు చేపట్టవచ్చు'అని తీర్పులో స్పష్టం చేసింది.

# అవి 'నీటి' తిమింగలం



హైదరాబాద్: మొయినాబాద్, నార్సింగి, న్యూస్‌టుడే: అతడు చేసింది ఏఈఈ ఉద్యోగమే.. కానీ అక్రమాస్తులు మాత్రం కొండంత. ఉద్యోగంలో చేరి పదేళ్లలోపే అయినా అవినీతి సంపాదన రోజుకు రూ.లక్షల్లోనే. నీటిపారుదల శాఖలో ఏఈఈగా చేస్తూ గతంలోనే ఏసీబీకి చిక్కి.. సస్పెండైన హేరూర్ నిఖేశ్‌కుమార్‌కు కళ్లు చెదిరే రీతిలో అక్రమ సంపాదన ఉన్నట్లు దర్యాప్తు సంస్థ తాజాగా గుర్తించింది. దాదాపు 20 ఏసీబీ బృందాలు శనివారం నిర్వహించిన సోదాల్లో నిఖేశ్‌కు చెందిన అక్రమాస్తుల గుట్టు రట్టయింది.ఉదయమే ఏసీబీ అధికారులు గండిపేట మండలం పీరంచెరువు పెబెల్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీలోని ఆయన ఇంటికి చేరుకున్నారు. ఆయన సమక్షంలోనే సోదాలు ప్రారంభించారు. మరికొన్ని బృందాలు మొయినాబాద్ మండలం తోల్కట్ట, సజ్జన్‌పల్లి, నక్కలపల్లి ఫాంహౌస్‌లతోపాటు బంధువులు, సన్నిహితులకు సంబంధించిన 19 ప్రాంతాల్లో తనిఖీలునిర్వహించి అక్రమాస్తుల దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో 5 ప్లాట్లు, 6.5 ఎకరాల వ్యవసాయభూమి, 6 ఫ్లాట్లు, 2 వాణిజ్యభవనాలకు సంబంధించినవి ఉన్నాయి. వాటి విలువ రూ.17,73,53,500గా తేలింది. బహిరంగ మార్కెట్‌లో సదరు అక్రమాస్తుల విలువ దాదాపు రూ.100కోట్లు ఉంటుందని అంచనా. నిఖేశ్‌ను అరెస్టు చేసినట్లు ఏసీబీ శనివారం రాత్రి వెల్లడించింది.

**లంచంలో వాటాకు ఆశపడి.. ఏసీబీకి చిక్కి..**

గండిపేట ఏఈఈగా పనిచేస్తూ నిఖేశ్ అనూహ్య పరిస్థితుల్లో మే 30న రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కి కటకటాల పాలయ్యాడు. వాస్తవానికి అప్పట్లో ఏసీబీకి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో అతడి పేరు లేదు. గండిపేట నెక్నాంపూర్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ స్థలం కందెనవాగు నాలాకు సమీపంలో ఉండటంతో నీటిపారుదల శాఖ నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సిన అవసరమేర్పడింది. ఇందుకు ఆ శాఖ ఏఈఈ కార్తిక్.. రూ.4లక్షల లంచం అడిగాడు. అంత ఇచ్చుకోలేనని అంటే చివరకు రూ.2.5 లక్షలకు దిగొచ్చాడు. తొలుత రూ.50వేలు తీసుకొని సర్వేయర్‌ను పంపించాడు. సర్వేయర్ రూ.40వేలు లంచం తీసుకున్నాడు.

అనంతరం నిరభ్యంతర పత్రం సిద్ధమైందని.. మిగిలిన సొమ్ముతో రెడ్‌హిల్స్‌లోని ఈఈ కార్యాలయానికి రావాలని ఆ రియల్ వ్యాపారికి కార్తిక్ సమాచారమిచ్చాడు. అయితే అప్పటికే ఆ వ్యాపారి ఏసీబీని ఆశ్రయించారు. ఈఈ భన్సీలాల్, ఏఈఈ కార్తిక్, సర్వేయర్ గణేష్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. మే 30న ఈఈ భన్సీలాల్ లంచం వాటా కింద రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదే సమయంలో నిఖేశ్ సైతం అక్కడికి వచ్చాడు. ఈ లావాదేవీలో తన వాటా కింద రూ.50వేలు లంచం పుచ్చుకునేందుకు అక్కడికి వచ్చి ఏసీబీకి చిక్కడంతో అతడికి చిక్కులు మొదలయ్యాయి. అదేరోజు నలుగురిని అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు.. ఆదాయానికి మించిన ఆస్తుల గురించి ఆరా తీయడంతో తాజాగా నిఖేశ్ అక్రమాస్తుల డొంక కదిలింది. అతడు ఇంతక్రితం వరంగల్, తాండూరులలో పనిచేశాడు. గండిపేటలో ఎక్కువ కాలం విధులు నిర్వర్తించాడు.

# బీజేపీ ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ సెటైర్లు



హైదరాబాద్ : బీజేపీ ఛార్జ్‌షీట్‌పై పీసీసీ ఛీఫ్ మహేష్ గౌడ్ సెటైర్లు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది కాలం పాలనపై .. కేంద్రంలోని బీజేపీ తన 10 ఏళ్ల పాలనపై చర్చించేందుకు మేం సిద్ధంగా ఉందా? రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీ ఛీఫ్ మహేష్ గౌడ్ బీజేపీకి పలు ప్రశ్నలు సంధించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగాన్ని రూపుమాపుతామని చెప్పారు. నల్ల ధనాన్ని తెచ్చి ప్రతి అకౌంట్ కు 15 లక్షల రూపాయలు వేస్తాం అన్నారు. వంద రోజుల్లో అన్ని రకాల ధరలు తగ్గిస్తాం అన్నారు.. డాలర్ కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని అన్నారు.50 రూపాయలకే లీటర్ పెట్రోల్ అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతాం అన్నారు.. ఏమయ్యాయి?దేశంలో వందలాది మంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీజేపీలోకి మార్చారు. దేశంలో 45 ఏళ్లలో లేని నిరుద్యోగ పరిస్థితిని కల్పించారు.

మతతత్వ రాజకీయాలు చేస్తూ.. పార్టీలను చీలుస్తూ రాజకీయ పబ్బం గడిపిన బీజేపీ ఇప్పుడు సుద్దాపూస మాటలు మాట్లాడుతుంది.

రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే.

మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం చేసకోవడంతో రాష్ట్రంలో బీజేపీ ప్రతిష్ట పూర్తిగా దిగజారింది. కాబట్టే రాష్ట్రంలో ఇలా ఛార్జ్‌షీట్ పేరుతో రాజకీయాలు చేస్తోంది.

బీజేపీ, బీఆర్ఎస్ కవల పిల్లలు. ఒకరికొకరు ఒకరికొకరు ఏ టీం, బీ టీంగా వ్యవహరిస్తారు. ఇది అనేక సార్లు రుజువైంది.

సార్వత్రిక ఎన్నికల్లో రహస్య ఒప్పందం జరిగింది.

2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ మోదీ గ్యారెంటీ పేరిట ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది. 2014 నుంచి 2024 వరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎన్నిసార్లు పెంచారు? దీనిపైన చర్చించడానికి సిద్ధమా?కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఈ పది సంవత్సరాల కాలంలో తెలంగాణకు ప్రత్యేకంగా ఏం చేసిందో చర్చించడానికి బీజేపీ నాయకులు సిద్ధమా? రైతుల సంక్షేమం కోసం ఒక్క సంవత్సర కాలంలోనే దాదాపు రూ. 54 వేల కోట్లు కాంగ్రెస్ ఖర్చు చేసింది. దీనిపై చర్చిద్దామా? దీంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు బీజేపీకి కనిపించడం లేదా?

# విడుదల చేసిన ప్రభుత్వం

**ఇప్పటివరకు రూ.20.68 వేల కోట్ల రుణమాఫీ**




హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన రూ. 2 లక్షల రుణమాఫీ హామీ అమలు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం మరోసారి నిధులు విడుదల చేసింది. ఇప్పటివరకు మూడు విడతల్లో 22.37 లక్షల మంది రైతుల రుణాల కింద రూ. 17,933 కోట్లు బ్యాంకులకు చెల్లించిన ప్రభుత్వం, శనివారం పాలమూరు వేదికగా నాలుగో విడత రూ. 2,747.67 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెక్కును రైతులకు అందజేశారు. తద్వారా ఇప్పటివరకు రూ.20.68 వేల కోట్లు రుణమాఫీ కింద బ్యాంకులకు విడుదల చేసినట్లయింది. శనివారం పాలమూరులో ప్రకటించిన రూ. 2,747 కోట్ల మొత్తాన్ని 3,13,897 మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. తద్వారా నాలుగు విడతల్లో రాష్ట్రంలోని 25 లక్షల పైచిలుకు రైతులకు ఇప్పటివరకు రుణమాఫీ జరిగినట్టు.

భవిష్యత్తులో రూ.2 లక్షలపైన ఉన్నవారికి..

రూ. 2 లక్షలపైన రుణాలు పొందిన రైతులకు కూడా రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని గతంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అయితే రూ. 2 లక్షలపైన ఉన్న రుణం మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించిన వారికి ఈ రుణమాఫీ చేయాలని వ్యవసాయ అధికారులు లెక్కలు తీశారు. శనివారం సీఎం ప్రకటించిన రూ. 2,747 కోట్ల మొత్తాన్ని రేషన్‌కార్డులు లేనివారు, కుటుంబ నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నవాళ్లు, బ్యాంకు ఖాతాల్లో పొరపాట్లు, పేర్లలో తప్పులు దొర్లిన 3,13,897 మంది రైతుల రుణ ఖాతాలకు జమచేస్తారు. తరువాత రూ. 2లక్షల పైన

# గంజాయి నియంత్రించేందుకు ఈగల్ ఏర్పాటు

గుంటూరు:ఏపీ పోలీస్ శాఖలో కొత్త దళం ఏర్పాటైంది. గంజాయి,మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఎలైట్ యాంటీ–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ – ఈగల్ ఏర్పాటైంది. మొత్తం 459 మంది సిబ్బంది పనిచేసే ఈగల్‌ను ఏర్పాటు హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో కొత్త వ్యవస్థ ఏర్పాటైంది. వ్యవస్థీకృతంగా మారిన గంజాయి సాగు, మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు పోలీస్ శాఖలో కొత్త దళాన్ని ఏర్పాటు చేశారు. ఎలైట్ యాంటీ–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ – ఈగల్ పేరుతో కొత్త జట్టును ఏర్పాటు చేస్తూ హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారుఈగల్ ఏర్పాటులో దానికి రూపురేఖలు తీసుకువచ్చారు. అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్స్ పోలీసుస్టేషన్, జిల్లాకొకటి చొప్పున 26 నార్కోటిక్స్ కంట్రోల్ విభాగాలు ఉంటాయి. పోలీస్ శాఖలో గతంలో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వైసీపీ హయంలో ఎక్సైజ్, పోలీసులతో కలిపి అక్రమ మద్యం,ఇసుక, మైనింగ్‌లపై నిఘా కోసం సెబ్‌ను ఏర్పాటు చేశారు. దాని వల్ల ప్రత్యేకంగా ఏమి సాధించలేకపోయారనే అపప్రదను వైసీపీ మూటగట్టుకుంది. దానిని టీడీపీ రద్దు చేసింది. కొత్తగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తూ హోంశాఖ ఉత్త ర్వులు జారీ చేసింది.ఈగల్ బృందానికి గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా, తర్వాత సుదీర్ఘ కాలం ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేసిన ఐజీ ఆకే రవికృష్ణ సారథ్యం వహిస్తారు. ఈగల్ కోసం అమరావతిలో రెండు స్టేషన్లు, గంజాయి సమస్య తీవ్రంగా ఉన్న ఏవోబీలోని విశాఖపట్నం, పాడేరు కేంద్రాలుగా మరో రెండు కలిపి మొత్తం నాలుగు రాష్ట్రస్థాయి టాస్క్ ఫోర్స్ బృందాలు ఈగల్‌లో పనిచేస్తాయి.అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తారు. కేసుల విచారణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మరో ఐదు చోట్ల ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారు. ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1972 ఏర్పాటు చేశారు. నార్కొటిక్స్ స్టేషను రాష్ట్రమంతటా పరిధి కల్పించారు. అమరావతిలో ఏర్పాటుచేసే నార్కోటిక్స్ పోలీస్ సిబ్బందికి రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి డ్రగ్స్ సంబందిత కేసుల దర్యాప్తు చేయొచ్చు. కేసుల విచారణకు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిల్లో ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.మాదక ద్రవ్యాలపై ఫిర్యాదులు చేసేం టోల్ ఫ్రీ నంబర్ (1972)ను ఏర్పాటు చేశాడు ఆమరావతిలో ఏర్పాటు చేసే కాల్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుంది. నార్కొటిక్స్ పోలీసు, నార్కోటిక్స్ కంట్రోల్ విభాగాల్లో మొత్తం 450 మంది సిబ్బంది పని చేయ నున్నారు. ప్రధాన కార్యాలయానికి 200 మందిని, జిల్లాల్లోని స్టేషన్ విభాగాలకు 181 పోస్టులు కేటాయించారు. పోలీసు శాఖలోని సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొని ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. ఈ విభాగంలో పనిచేసే వారికి అదనపు ఇన్సెంటివ్‌లు చెల్లిస్తారు.ఈగల్ హెడ్ ఆఫీస్, నార్కోటిక్ పోలీస్ స్టేషన్, జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్ లో పని చేసే వారికి విధి నిర్వహణ కాలంలో 30శాతం స్పెషల్ అలోవెన్స్ చెల్లిస్తారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆధ్వర్యంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు,

తిరుపతి ప్రాంతాల్లో 5 స్పెషల్ కోర్టులు లేదా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటును డీజీపీ నేరుగా పర్యవేక్షిస్తారు. ఒక్కో నార్కోటిక్ పోలీస్ స్టేషన్ లో 66 మంది సిబ్బంది డిప్యుటేషన్ లో విధులు నిర్వర్తిస్తారు.జిల్లాలవారీగా నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్ లో 144 మంది పనిచేస్తారు. మొత్తం 358 మంది అధికారులతో ఈగల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా కలుపుకుని డ్రగ్స్ నియంత్రణ కోసం మొత్తం 459 మందితో కూడిన ఈగల్ వ్యవస్థలో ఉంటారు.

వేగుచుక్క

# ఐక్యంగా అభివృద్ధి సాధించాలి.

♦ నుడా ఛైర్మెన్ కేశ వేణు. ♦ 13వ తర్ఫా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 1:**

పద్మశాలి ప్రజలు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని నుడా ఛైర్మెన్ కేశ వేణు అన్నారు. నగరంలోని గాజుల్ పేట్, రాంమందిర్ 13వ తర్ఫా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం సంఘ భవనంలో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు ఎనగందుల సుభాష్, ఎనగందుల మోహన్, అచ్చుగట్ల నారాయణలతో పాటు ఇతర కార్యవర్గంచే పద్మశాలి సంఘం నగర అధ్యక్షులు గుజ్జేటి వెంకట్ నర్సయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా నుడా ఛైర్మెన్ కేశ వేణు హాజరై ప్రసంగించారు. ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పద్మశాలీలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేందుకు తన వంతు సహకారం అందజేస్తానన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నరాల రత్నాకర్, జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు డి.యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లం హన్మాండ్లు, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.రాజేశ్వరి, నగర సంఘం సంయుక్త కార్యదర్శి దాసరి గుండయ్య,13వ తర్ఫా గౌరవాధ్యక్షులు శ్రీరాం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల ఎప్పుడూ నిర్లక్ష్యంవహించలేదు.

**తల్లిదండ్రులు వచ్చే వరకు విద్యార్థి జశ్విత్ రెడ్డి ఆరోగ్యంగానే ఉన్నాడు.**

**కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజినీకాంత్ వెల్లడి.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 1:**

తమ విద్యాసంస్థలో అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ఎటువంటి నిర్లక్ష్యం వహించమని కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ రజినీకాంత్ స్పష్టం చేశారు. తమ విద్యాసంస్థలో చదువుకునే పిల్లల యోగక్షేమాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నగరంలోని కాకతీయ పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి జశ్విత్ రెడ్డి మృతి తమ విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు తీరని లోటన్నారు. ఘటనపై ఇప్పటికే పోలీసులు పూర్తి వివరాలను సేకరించారని, ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పేర్కొన్నారు. వారం రోజులుగా విద్యార్థి ఆరోగ్యం బాగోలేదని కొందరు అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. విద్యార్థి ముందు రోజు కూడా యాక్టివ్ గా పాఠశాలలో తిరిగాడని, వాలీబాల్ కూడా ఆడాడన్నారు. ముందు రోజు వాంతులు రావడంతో తమ వార్డెన్ ప్రథమ చికిత్స చేయించారని తెలిపారు. మృతి చెందిన రోజు కూడా తమ సిబ్బంది ఆసుపత్రికి తీసుకెళ్లడానికి పలకరించగా, తల్లిదండ్రులు వచ్చిన తర్వాతే వెళ్తానని విద్యార్థి చెప్పాడని వివరించారు. విద్యార్థి తల్లిదండ్రులు వచ్చాక వారి కారులోనే ప్రతిభ హాస్పిటల్ కు తీసుకెళ్లామని, హాస్పిటల్లో మృతి చెందాడని తెలిపారు.

రెండు రోజులుగా విద్యార్థి పాఠశాలలో ఉన్న సమయంలో జరిగిన పరిణామాలపై పూర్తి సీసీ ఫుటేజ్ ను మీడియాకు విడుదల చేశారు.

# అవగాహణతోనే హెచ్ఐవి దూరం.

**- అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 1:**




అవగాహణతోనే హెచ్ఐవి దూరం అవుతుందని అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

వరల్డ్ ఎయిడ్స్ డే 2024 సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. మొదటగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి, అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఈ వ్యాధిని దూరం చేయడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఒకప్పుడు ఈ వ్యాధి అంటే చాలామంది భయపడే వారని, అలాగే ఆత్మహత్యలు కూడా చేసుకునే వారని అన్నారు. ప్రస్తుతం ఆధునిక చికిత్స ద్వారా హెచ్ఐవి సోకిన వారికి క్రమంగా మందులు వాడితే ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరిలాగే జీవించే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే మనము రాబోయే రోజుల్లో హెచ్ఐవి నిర్మూలించే అవకాశం ఉందని తెలియజేశారు.

వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ వివిధ కళాశాల, పాఠశాలలో వ్యాసరచన పోటీలు, పోస్టర్ల తయారీ అలాగే రంగోలి పోటీల నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే హెచ్ఐవి నిర్మూలన కోసం పనిచేసే ఆరోగ్య సిబ్బందిని మరియు స్వచ్ఛంద సంస్థల సిబ్బందిని ప్రశంస పత్రాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాధిక ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డా ఫరీదా, ఏఆర్ టి నోడల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, ఏఆర్టి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ, డిపిఓ పద్మజ, డిపిఎం సుధాకర్, జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, పాజిటివ్ నెట్ వర్క్, సాయి చారిటబుల్ ట్రస్ట్, హెల్పింగ్ హ్యాండ్స్, వివిధ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. .

# పవర్ కావాంటే పవన్ ...



కాకినాడ:జనసేన అధినేత పవన్ కల్యాణ? పూర్తి ఫామ్ లో ఉన్నాడు. సినీరంగంలో వెలిగిపోయినట్లుగా రాజకీయ రంగంలోనూ 2024 ఎన్నికల తర్వాత ఆయన పవర్ స్టార్ అయ్యారు. పవర్ కావాలంటే పవన్ వెంట ఉండాలన్న నినాదాన్ని ఆయన వెంట పెట్టుకుని తిరుగుతున్నారు. ఇది ఆయనకు వెన్నంటి ఉన్న కాపు సామాజికవర్గం కావచ్చు. అభిమానులు కావచ్చు. ఆయనకు జనంలో ఉన్న క్రేజ్ కావచ్చు. పవన్ కల్యాణ్ పక్కన ఉంటే చాలు గెలుపు తథ్యమన్న భావన రాజకీయపార్టీల్లో నెలకొంది. పవన్ కల్యాణ్ ను వదులుకునేందుకు బహుశ కూటమిలోని ఏ పార్టీ సిద్ధంగా లేదు. పది కాలాల పాటు అధికారంలో ఉండాలంటే పవన్ సహకారం అవసరమన్న నమ్మకంలో నేతలున్నారు అదే సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా పవన్ కల్యాణ్ కు అన్ని విధాలుగా గౌరవం ఇస్తున్నారు. గుర్తింపు ఇస్తున్నారు. ఆయన అడిగింది అడిగినట్లు చేస్తున్నారు. తన వారిని కాదనుకుని మరీ పవన్ మాటను తీసిపక్కన పెట్టలేని పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నారు. వంద రోజులు పాలన సమావేశంలోనూ, ఇటీవల జరిగిన ఎమ్మెల్యేలతో జరిగిన భేటీలోనూ ఇదే కూటమితో వచ్చే ఎన్నికల్లో వెళతామని చంద్రబాబు చెప్పారంటే పవన్ వెంట ఉంటే విజయం తమ వెంటేనన్న ధీమాతో ఉన్నారు. పవన్ కల్యాణ్ కు పెద్దగా పదవీకాంక్ష లేదు. అధికార దాహం కూడా లేదని, అలాగే పాలనలో పెద్దగా జోక్యం చేసుకునే మనస్తత్వం కాదని, తన పని తాను చేసుకుబోయే వ్యక్తి కనుక ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరిందని టీడీపీ నేతలే అంగీకరిస్తున్నారు. ఇక కూటమిలోని మరొక పార్టీ బీజేపీ. బీజేపీ పవన్ కల్యాణ? ను కేవలం ఆంధ్రప్రదేశ్ కు పరిమితం చేసి చూడటం లేదు. దక్షిణాది రాష్ట్రాలకు తమ పార్టీకి ముందు ముందు భవిష్యత్ నేతగా భావిస్తుంది. అందుకే పవన్ కల్యాణ? కు బీజేపీ కేంద్ర నాయకత్వం అంత ప్రయారిటీ ఇస్తుంది. పవన్ తరచూ ఢిల్లీ వెళుతూ యన ప్రాతినిధ్యం వహించే శాఖకు మాత్రం నిధులు దండిగానే మంజూరు చేసుకుంటున్నారు. బీజేపీ అధినాయకత్వం కూడా పవన్ ను మచ్చిక చేసుకుంటుంది. మరో వైపు పవన్ కల్యాణ? కూడా వ్యక్తిగతంగా బీజేపీ కంటే మోదీ, అమిత్ షాలకు వీరభక్తుడిగా నిలిచారు. వారిద్దరినీ అమితంగా ప్రేమించే పవన్ కల్యాణ? వారిని వదులకుని వేరు కుంపటి పెట్టుకునే ప్రయత్నం చేయరన్నది అంతే వాస్తవం. అందుకే జమిలి ఎన్నికలు 2027 ఎన్నికల్లో జరుగుతాయిని ప్రచారం జరుగుతుంది. అదే జరిగితే పవన్ కల్యాణ్ పంట పండినట్లే. ఎందుకంటే ముందు వచ్చిన ఎన్నికల్లో పవన్ కల్యాణ? ఈసారి అత్యధిక స్థానాలను కూటమి పార్టీల నుంచి తెచ్చుకునే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లో 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాలకే పరిమితమైన జనసేనాని ఈసారి మాత్రం అంతకు రెట్టింపు స్థానాలను కోరే అవకాశముంది. అందుకే జనసేనలోకి పార్టీ నేతలను చేర్చుకుంటున్నారని అంటున్నారు. టీడీపీ నుంచి కూడా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చుని అంటున్నారు. కనీసం యాభై స్థానాలకు పైగానే ఈసారి పోటీచేయాలన్న ఉద్దేశ్యంతో ఆయన ఉన్నారని తెలిసింది. తాను కింగ్ మేకర్ గా మారాలన్నది పవన్ కల్యాణ్ వ్యూహంగా కనిపిస్తుంది. అందుకే పవన్ ఏం మాట్లాడకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. అయితే ఇటీవల శాసనసభలో పదేళ్ల పాటు సీఎంగా చంద్రబాబు ఉండాలని చేసిన కామెంట్స్ కూడా వ్యూహాత్మకమేనని అంటున్నారు. ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు జమిలి ఎన్నికల తర్వాత చోటు చేసుకుంటాయన్న అభిప్రాయం మాత్రం బలంగా వినిపిస్తుంది.

# ఏపీలో తగ్గిన మద్యం ధరలు



ఒంగోలు:ఏపీలో మద్యం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఐదేళ్లుగా చుక్కలనంటుతున్న మద్యం ధరలతో ఖజానాకు భారీగా ఆదాయం వస్తున్న ప్రజల జేబులకు మాత్రం భారీగా చిల్లు పడుతోంది. 2019 జూన్ ధరలతో పోలిస్తే 2024 జూన్‌కు మద్యం ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. ఏపీలో అక్టోబర్ 16నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో వేలంలో దక్కించుకున్న వారి ఆధ్వర్యంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో కొత్తగా రూ.99 బ్రాండ్‌ను తీసుకొచ్చిన మిగిలిన బ్రాండ్ల ధరలను మాత్రమే పాత ధరలనే కొనసాగించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. జనం జగన్ బాటలోనే చంద్రబాబు ప్రభుత్వం నడుస్తోందని గొణుక్కుంటూ మద్యం కొనుగోలు చేస్తున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మద్యం ధరలపై ఇప్పటికే రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక రావడానికి ముందే ధరలు తగ్గుముఖం పట్టడం చర్చనీయాంశంగా మారింది. .రాష్ట్రంలో మద్యం ధరలను తగ్గించడానికి మూడు పాపులర్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ప్రముఖ సంస్థల ప్రతిపాదనలకు ఎక్సైజ్ శాఖ వాటి ఆమోదం తెలిపింది. తగ్గించిన ధరలను అమల్లోకి తెస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ప్రస్తుతం దుకాణాల్లో పాత ఎమ్మార్పీలతో ఉన్న బాటిళ్లను ఆ ధరలకే విక్రయిస్తారు. కొత్తగా వచ్చే స్టాకును తగ్గించిన ధరలతో అమ్ముతారు. ఏపీలో గత ఐదేళ్లలో ప్రముఖ బ్రాండ్ల విక్రయాలకు అవకాశం ఉండేది కాదు. తాజాగా అన్ని బ్రాండ్లను విక్రయించుకోడానికి అనుమతిస్తున్నారు.ధరలు తగ్గిన బ్రాండ్లలో మాన్షన్ హౌస్ ఒకటి. 2019లో టీడీపీ ప్రభుత్వం గద్దె దిగే సమయానికి క్వార్టర్ రూ.110 ఉన్న మద్యాన్ని వైసీపీ హయంలో ఓ దశలో రూ.300కు విక్రయించారు. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ధరలు తగ్గించి చివరకు రూ.220కు ఫిక్స్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. అదే బ్రాండ్ హాఫ్ బాటిల్ ధర రూ.440 నుంచి రూ.380కి, ఫుల్ బాటిల్ ధర రూ.870 నుంచి రూ.760కి తగ్గించారు.రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ ధర రూ.230 నుంచి రూ.210కి తగ్గింది. ఇదే బ్రాండ్ ఫుల్ బాటిల్ ధర రూ.920 నుంచి రూ.840కి తగ్గించారు. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్ ధర రూ.1600 నుంచి రూ.1400కు తగ్గింది.మద్యం ధరలపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. త్వరలో ఈ కమిటీ అన్ని బ్రాండ్ల కంపెనీలతో చర్చించి ధరల సవరణపై సిఫారసు చేయనుంది. అందుకు అనుగుణంగా కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. కమిటీ నిర్ణయించక ముందే కొన్ని బ్రాండ్లు రేట్లు తగ్గించుకుంటున్నాయి. మరో రెండు ప్రముఖ బ్రాండ్ల మద్యం ధరలు రెండు మూడు రోజుల్లో ధరలు తగ్గించనున్నాయి.హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో మద్యం ధరల సవరణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అన్ని కంపెనీలతో ధరల సవరణపై చర్చలు జరపనుంది. బాటిల్ తయారీకి ఎంత ఖర్చు అవుతుంది? ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ధరలను పరిశీలించనుంది. ఏపీ, తెలంగాణలో విక్రయించే బ్రాండ్ల ధరల్లో భారీ వ్యత్యాసాలుంటే వాటిని ప్రశ్నించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా ధరలు తగ్గిస్తున్నాయని చెబుతున్నారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలవడంలో మద్యం కూడా కీలక పాత్ర పోషించింది. సంపూర్ణ మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ చివరకు మద్యం అమ్మకాలతో అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలకు లింకు పెట్టి మద్యం అమ్మకాలు సాగించాడు.మద్యం ధరలు గణనీయంగా పెరగడం, నాణ్యత లేకపోవడం, ఊరు పేరు లేని బ్రాండ్ల విక్రయాలను జే బ్రాండ్లుగా ప్రచారం చేయడంలో టీడీపీ సక్సెస్ అయ్యింది. మద్యం ధరలు భారీగా పెంచడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా 2019తో పోలిస్తే రెట్టింపైంది.మద్యం ఉత్పత్తి సంస్థలు నేరుగా విక్రయించే అవకాశం లేకపోవడంతో తమ మద్యాన్ని ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్‌కు సరఫరా చేస్తుంటాయి. మద్యం గరిష్ట ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. డిస్టిలరీలు ప్రభుత్వానికి సరఫరా చేసే ధరను బేసిక్ ధరగా పరిగణిస్తారు. ఈ ధరపై ఎక్సైజ్ డ్యూటీ విధిస్తారు. ఆ మొత్తానికి స్పెషల్ మార్జిన్, హోల్‌సేల్ ట్రేడ్ మార్జిన్ విధిస్తారు. ఈ పన్నులన్నీ విధించిన తర్వాత వచ్చేదానిపై వ్యాట్ వసూలు చేస్తారు. ఈ మొత్తం ధరపై 20 శాతం రిటైలర్ మార్జిన్ విధిస్తారు. ఈ మొత్తంపై అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ వేస్తారు. పన్నులన్నీ కలిపిన తర్వాత కొనుగోలుదారుడికి అందించే ధరను ఎమ్మార్పీగా ముద్రిస్తారు.మద్యం ఉత్పాదక ధరతో పోలిస్తే ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులే అధికంగా ఉంటున్నాయి. వైసీపీ హయంలో రకరకాల పేర్లతో మద్యం ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నాలు జరిగాయి. మద్యం బేసిక్ ధర ఆధారంగా అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ విధిస్తారు. ఇలా వసూలు చేసే పన్ను ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌పై 137 శాతం నుంచి 226 శాతం వరకు ఉంటుంది. కొన్ని బ్రాండ్లపై ఉత్పాదక వ్యయం కంటే అధికంగా పన్నులు చెల్లిస్తున్నారు. బీర్లపై 211శాతం, వైన్‌పై 187శాతం, రెడీ టు డ్రింక్స్‌పై 39శాతం వసూలు చేస్తున్నారు.

# పోస్టాఫీసులకు పరుగో... పరుగు..



తిరుపతి:సాధారణంగా పోస్టాఫీస్ లకు ఆదరణ తగ్గింది. ఒక్క హెడ్ పోస్టాఫీసులు తప్ప.. మిగతా వాటిలో పెద్దగా లావాదేవీలు కనిపించవు. జనాలు కూడా ఉండరు. అటువంటిది గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీస్ లు జనాలతో కళకళలాడుతున్నాయి. రోజురోజుకీ జనం తాకిడి పెరుగుతోంది. చాలామంది కొత్త ఖాతాలు తెరిచేందుకు క్యూ కడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని ఈ వాతావరణానికి కారణం ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక సంకేతమే. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతోంది. ఇప్పుడిప్పుడే సంక్షేమ పథకాల అమలు ప్రారంభం అయ్యింది. పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు అమలవుతున్నాయి. మిగతా పథకాలు సైతం వీలైనంత త్వరగా అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇదే క్రమంలో బ్యాంకుల్లో ఖాతాలు లేని వారు, ఆధార్ లింకు కాని వారు పోస్ట్ ఆఫీస్ లో ఖాతాలు తెరవాలని ఓ సంకేతం వచ్చింది. దీంతో లక్షలాది మంది జనం పోస్ట్ ఆఫీస్ ల చుట్టూ తిరగడం ప్రారంభించారు. అయితే ఇప్పటికే పోస్ట్ ఆఫీసుల్లో ఖాతాలు ఉన్నవారు సైతం ఎగబడుతుండడం విశేషం.ఇదివరకు మాదిరిగా పోస్ట్ ఆఫీసులకు ఆదరణ తగ్గింది. ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా తగ్గాయి. ఇప్పుడంతా నెట్ బ్యాంకింగ్ విధానం అమల్లోకి వచ్చింది. దీంతో పోస్ట్ ఆఫీస్ లో వైపు చూడడం మానేశారు ప్రజలు. కానీ ఇప్పుడు కొత్తగా వచ్చిన ఈ ప్రచారంతో ఎక్కువమంది పోస్ట్ ఆఫీస్ వైపు పరుగులు తీస్తున్నారు. వాస్తవానికి బ్యాంకులో అకౌంట్ లేనివారు,

ఉండి కూడా ఆధార్ తో లింకు కాని వారు మాత్రమే పోస్ట్ ఆఫీసుల్లో ఖాతా తెరవాల్సి ఉంటుంది. అలాగే పోస్ట్ ఆఫీసులో అకౌంట్ ఉన్నవారు వాటికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ తో లింక్ కాకపోతే.. అటువంటివారు పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి లింక్ చేసుకోవాలి.

కానీ ఇవేం తెలియని చాలామంది ఎక్కడ సంక్షేమ పథకాలుకోల్పోతామని భావించి పోస్ట్ ఆఫీస్ వైపు పరుగులు తీస్తున్నారు.అయితే ఈ విషయంలో అవగాహన కల్పించాల్సిన సచివాలయ సిబ్బంది తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆధార్ లింక్ కాని వారి వివరాలను సేకరించి పంపిస్తున్నారు. అయితే అసలు విషయం తెలియని చాలామంది అనవసరంగా పోస్ట్ ఆఫీస్ లకు వెళ్తున్నారు. ఆధార్ లింకు ఎందుకు? అలా ఎందుకు చేయాలి? చేయకపోతే వచ్చే ఇబ్బందులు ఏంటి? అనే అంశాలను గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తే పెద్ద ఇబ్బందులు ఉండవు. అయితే సచివాలయ సిబ్బంది ఆధార్ లింక్ కోసం పంపిస్తుండటంతో.. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ లకు వెళ్తున్నారు. దీంతో పోస్ట్ ఆఫీసులు రద్దీగా మారుతున్నాయి.

# నిరుద్యోగులకు అండగా "రాజీలేని పోరాటం"

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి.
- ఘనంగా కరీంనగర్ నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం.
- బైక్ ర్యాలీ, బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన పట్టభద్రులు.











**వేగుచుక్క న్యూస్, కరీంనగర్, డిసెంబర్ 1:**

నిరుద్యోగులకు అండగా "రాజీలేని పోరాటం" కొనసాగిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి అన్నారు. గతంలో ఎమ్మెల్సీగా గెలిచిన నాయకులు పట్టభద్రుల సమస్యలను విస్మరించి, పూర్తిగా రాజకీయాలకే సమయం కేటాయించారని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగ నిరుద్యోగ సమస్యలపై మండలిలో గలమెత్తుతానని అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం పెద్ద ఎత్తున నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెనెక్స్ మైదానం నుండి 1500 మోటార్ బైక్ లతో ర్యాలీ చేపట్టి, పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించారు. పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి వివిధ జిల్లాల నుండి విద్యావంతులు, పట్టభద్రులు, మేధావులు డాక్టర్లు, న్యాయవాదులు ఉపాధ్యాయులు భారీగా తరలి వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ యన్ఎస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతానని వెల్లడించారు. ఉద్యోగ నిరుద్యోగపట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని వెల్లడించారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల యజమానిగా తాను ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తయారు చేశానని, ఎంతో మంది పట్టభద్రులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించానని అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఒక విద్యా సంస్థల యజమానిగా కృషి చేశానని వెల్లడించారు. తాను గత 3 నెలల నుండి ఎమ్మెల్సీ సెగ్మెంట్ పరిధిలో ఉన్నా 42 అసెంబ్లీ నియోజక వర్గాలు పర్యటించడం జరిగిందని, ఈ క్రమంలో వేలాదిమంది విద్యావంతులను, నిరుద్యోగ యువతను, వివిధ రంగాలలో పనిచేస్తున్నా ప్రైవెట్, ప్రభుత్వ ఉద్యోగులను కలవడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా అనేక సమస్యలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. విద్యావంతుడైన తనను ఆశీర్వదించాలని, ఎమ్మెల్సీ గా పోటీచేయడానికి మీ ముందుకు వస్తున్నానని అన్నారు. ఎందుకంటే గత 34 సం.ల నుండి మీ అందరిలో ఒక్కడిగా ఉంటూ, మీ అందరి ఆశీర్వాదంతో కరీంనగర్లోని ప్రతి కుటుంబ సభ్యుడిగా ఉన్న తనను ఆదరించాలని కోరారు.

**ప్రతి జిల్లా కేంద్రంలో ఉచితంగా కోచింగ్ సెంటర్లు.**

వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు స్టడీ మెటీరియల్ తో కూడిన పాఠ్యపుస్తకాలను అందజేసినట్టుస్పష్టం



చేశారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. నిజామాబాద్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు నెలరోజుల పాటు మధ్యాహ్నం భోజనం సదుపాయం కల్పిస్తానని వెల్లడించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యేలా ఉచిత కోచింగ్ సెంటర్లను నెలకొల్పుతానని పేర్కొన్నారు. యువత ఉద్యోగ ఉపాధి కల్పన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తన సొంత ఖర్చులతో ఎమ్మెల్సీ పరిధిలోని ప్రతి జిల్లా కేంద్రంలో కోచింగ్ సెంటర్లను నెలకొల్పుతానని అ అన్నారు. విద్యారంగ సమస్యలపై తనకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని వెల్లడించారు.. ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 317 జీవో తో ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి స్థానికతను ఆధారంగా తీసుకొని సొంత జిల్లాలకు బదిలీ అయ్యే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ రంగంలోని వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తానని, ప్రైవేటు విద్యా సంస్థలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సంక్షేమానికి పాటుపడుతానని అన్నారు. ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులతో పాటు కనీసం మినిమం బేసిక్ సాలరీ అమలుకు కృషి చేస్తానని అన్నారు. ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాల యాజమాన్యాలు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రభుత్వం నుండి రావలసిన నిధుల బకాయిలను విడుదల చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల యొక్క డిఏల మంజూరికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ నరేష్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, సుక్మా స్టేట్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, తానిపర్తి తిరుపతి రావు, చిదుర సురేష్, టీఎన్జీవో ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, సంగేం లక్ష్మణరావు, అపూర్వ వేణు, వి సతీష్ కుమార్, కనకం వంశీ, కాశి పెద్ధి శ్రీధర్ రాజు, రాజిరెడ్డి, కిషన్ నాయక్, పెండ్యాల కేశవరెడ్డి, ఎర్రం శెట్టి మునిందర్, ప్రభాకర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, ట్రస్మా జనరల్ సెక్రెటరీ మజీద్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అజిజ్, సర్దార్ శార్దూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.







